

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

అన్నయ్యతో మాట్లాడ్డం పూర్తయ్యాక "నువ్వు సీరియల్స్ చూస్తావా?" హనీష అడిగింది.

"ఇది వరకు అమృతం చూసేదాన్ని. అంతే."

"హిందీవి ఏం చూడవా?"

"లేదు."

"నేను కొన్ని చూస్తాను."

"ఔనా"

"యా. చూస్తావా నాతో పాటు?"

"చూస్తా" స్నేహం పెంచేందుకు ఒప్పుకున్నాను.

లేప్టాప్ తెరిచి యూట్యూబ్‌లో ఏదో పెట్టింది. రీకేప్ చూసిన తరవాత "సో ఈ అమ్మాయి తన బాయ్ ఫ్రెండ్‌ని పెళ్ళి చేసుకుంది. అందరూ అరేంజ్డ్ మారేజ్ అనుకున్నారు. లవ్ అని తెలిసాక వాళ్ళ అత్తయ్య తనని చంపేయాలని ట్రై చేసింది. అది తన హజ్బెండ్‌కి తెలిసి ఇల్లు మారతాడు. కానీ అత్తయ్య ఏదో వంకతో వస్తూ ఉంటుంది."

"ఓ..ఓకే"

"పాలలో విషం కలిపింది లాస్ట్ ఎపిసోడ్‌లో"

"అత్తయ్యా?"

"ఔను."

"ఓ. టూ మచ్."

"తను తాగుతుందా లేదా ఇప్పుడు చూడాలి."

కొత్త ఎపిసోడా?"

"యా. ఇండియాలో ఆల్రెడీ రిలీజ్ అయిపోయింది. యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తారు."

"ఓ. ఓకే."

గంట సేపు మొహాలు చూసుకోవడం, జూమ్ ఇన్, జూమ్ ఔట్ చెయ్యడం, మళ్ళీ మొహాలు చూపించడం. బోర్ కొట్టి ఆవులింతలు కూడా వచ్చాయి. కష్టపడి మెలకువుగా ఉన్నాను. అరగంట ఎపిసోడ్ అయ్యేక కూడా పాలగ్లాస్ కదలకుండా టేబుల్ మీద అలానే ఉంది."

"అబ్బా, నెక్స్ట్ ఎపిసోడ్ వరకూ వెయిట్ చెయ్యాలి"

"యా" అసలు ఎందుకు చూస్తుందో అర్థంకాక అడిగాను.

"నచ్చిందా?"

"యా. బానే ఉంది."

"డైలీ చూస్తే స్టోరీ అర్థమౌతుంది."

"నువు డైలీ చూస్తావా?" ఆశ్చర్యపోయాను.

"యా. కానీ ఓన్లీ ఫోర్ సీరియల్సే చూస్తాను."

ఆ అరగంటకే నాకు ఎంతో టైం వేస్ట్ చేసిన ఫీలింగ్ వచ్చింది. రోజుకి రెండు గటలు ఎలా వృధా చేస్తుందో నాకు అంతు పట్టని విషయం.

"ఇంకోటి చూద్దామా?" అడిగింది.

ఇష్టంలేకపోయినా "సరే" అన్నాను.

ఇంకో అరగంట వృథా. నాకు నచ్చలేదని తనకి అర్థమైందనుకుంటాను, ఇంకో సీరియల్ చూస్తావా అని అడగలేదు.

"నీకు డాక్టర్స్ ఇష్టమా?" అడిగింది.

"ఇష్టమే" ఎందుకు అడిగిందో అర్థం కాలేదు.

"దిల్ మిల్ గయే చూసావా?" అడిగింది.

"ఒకటో రెండో ఎపిసోడ్లు చూసాను, అంతే."

"అది బావుంటుంది. ఒక రెండు ఎపిసోడ్స్ చూడు. నచ్చితే మొత్తం చూడొచ్చు" అంది.

"సరే చూస్తాను" అన్నానో లేదో, వెంటనే యూట్యూబ్‌లో 'దిల్ మిల్ గయే' అని వెతికింది. ఇప్పుడు ఇంకో గంట మళ్ళీ వృథా. ఈసారి నిద్రొస్తే కళ్ళు మూసుకుంటానని నిశ్చయించుకున్నాను. టైటిల్ సాంగ్ మొదలవడంతో ఆవులింత వచ్చింది. వెంటనే కళ్ళు మూసుకున్నాను.

"నిద్రపోతున్నావా?" పాట పూర్తయ్యాక అడిగింది.

"లేదు. ఉత్త కళ్ళు మూసుకున్నాను"

"ఇది నీకు నచ్చొచ్చు. చూడు"

ఈ సీరియల్ ఇంతకు ముందు వాటిలా కాక నిజంగానే బానేవుంది. అలా వరసగా మూడు ఎపిసోడ్లు చూసాము. ఇంతలో తలుపు చప్పుడైంది. చూస్తే వెన్నెల ఇంటికి వచ్చేసింది.

"అప్పుడే వచ్చావా?" అడిగాను.

"టైం ఇంత లేట్ అయితే అప్పుడే వచ్చావా అంటావా? అమ్మా" నవ్వింది.

'నిజమే పొద్దున కేంపస్ కి వెళ్ళాము. తర్వాత రెండున్నర గంటలపాటు లేప్‌టాప్‌లో వీడియోలు చూసాము.'

'సారీ చెప్పిన వెంటనే జోక్ చేస్తున్నా' అంది వెన్నెల.

"ఇవాళ్ళ అవనిని కేంపస్‌కి తీసుకెళ్ళాను. అందరూ భయపెట్టారు కాస్త కానీ వాళ్ళ అన్నయ్యతో మాట్లాడాక సెట్ అయ్యింది" వెన్నెలతో హనీష చెప్పింది. నేను భయపడిన సంగతి, అన్నయ్య ధైర్యం ఇచ్చింది ఎలా కనిపెట్టింది అని తెగ ఆశ్చర్యపోయాను. తినతో కాస్త జాగ్రత్తగా ఉండాలి. తోక పట్టుకుని కుక్కపిల్ల అని చెప్పేసేట్టు ఉంది.

"మంచిది, అన్నయ్యతో మాట్లాడావు. లేకపోతే కృంగిపోయేదానివి" వెన్నెల అంది.

"వాళ్ళ అన్నయ్యతో ఎంత బాగా మాట్లాడిందో తెలుసా?" హనీష అంది.

"ఏమని మాట్లాడావు?" అని వెన్నల అడిగింది.

"నార్మల్‌గానే మాట్లాడాను. జరిగింది చెప్పాను అంతే"

"లేదు, అదికాదు ,అన్నయ్య, అన్నయ్య అని పిలిచింది. అస్సలు కోపం తెచ్చుకోలేదు. అన్నిటికీ సరే అంది. ఒక్క చోట కూడా ఎదురించలేదు. నీలాంటి చెల్లిని చూడ్డం ఇదే మొదటిసారి"

వామ్మో నాకు తెలియకుండానే అన్నీ వింది. కొంచెం కంత్రీ పిల్లే అనుకున్నాను.

"అందరూ నీలా ఉంటారనుకుంటున్నావా దెయ్యం" వెన్నల హనీషతో అంది.

"నువ్వు మీ అన్నయ్యతో ఎప్పుడూ అలానే ఉంటావా?" నన్ను అడిగింది.

"మేము కూడా కొట్టుకుంటాము, కానీ చాలావరకు ఇలానే ఉంటాం. కోపం ఎంతున్నా అన్నయ్య అనే పిలుస్తాను. ఒరేయ్ అలాంటి పదాలు నేను ఎందుకో వాడను. చాలా రూడ్‌గా అనిపిస్తుంది నాకు" బదులిచ్చాను.

"హౌ క్యూట్" నవ్వింది వెన్నెల.

"నీలాంటి చెల్లి ఉంటే మా అన్నయ్య ఇంకా రెచ్చిపోయేవాడు. నేను కంట్రోల్‌లో పెడుతున్నా కాబట్టి ఈ మాత్రం ఉన్నాడు" హనీష చెప్పింది.

"నేను స్నానం చేసి వస్తా" వెన్నెల లోపలికి వెళ్ళింది.

"120 సెకండ్స్ కౌంట్ చెయ్యి, ఈలోపు వచ్చేస్తుంది" హనీష్ అంది.

నేను నవ్వడం చూసి "జోక్ కాదు నిజంగానే" అంది.

"మరీ ఎక్జాట్‌గా టూ మినిట్స్‌లో రాదు. అది టూ మచ్" అన్నాను.

"సరే. బెట్ కడదామా" అడిగింది.

"సరే" ఇద్దరం కలిసి నంబర్లు లెక్కపెట్టడం మొదలు పెట్టాము. 127 దగ్గర ఉన్నప్పుడు వెన్నెల వచ్చేసింది.

"ఛా. సెవెన్ సెకెండ్స్‌లో ఓడిపోయాను" అంది హనీష.

"ఏం ఓడిపోయావు?" వెన్నెల అడిగింది.

"ఏం లేదులే. డిన్నర్‌కి ఏంటి? నాకు పెద్దగా ఆకలైతే లేదు. మేము దోసెలు, ఐస్క్రీం తిన్నాం" హనీష అంది.

నాకు బోలెడంత ఆకలి. 'మేము' అని ఇద్దరికీ ఆకలి లేదు అని అర్థం వచ్చేట్టు చెప్పింది. సర్లే, అన్నయ్య కొనిచ్చినవి తిందాం అనుకున్నాను.

ఇంతలో "నాకు ఘోరంగా ఆకలేస్తుందోయ్. పులావ్ చేస్తా, పచ్చడితో తినేద్దాం సరేనా?" నన్ను చూస్తు అడిగింది.

"సరే నేను నీకు హెల్ప్ చేస్తాను" అన్నాను.

"హెల్ప్ అక్కర్లేదు. అన్నీ కలిపి కుక్కర్‌లో పెట్టేస్తా, అంతే" అంది.

"వెజిటబుల్స్ కొయ్యనా?"

"నేను ఫ్రోజెన్‌వి వాడతా. అన్నీ కోసే ఉంటాయి" నవ్వింది.

"రైతా చెయ్యనా అయితే?" అడిగాను.

"యా, చెయ్యి. పచ్చిమిరపకాయలు ఎక్కువ వెయ్యి" అంటూ కటింగ్ బోర్డు, చాకు అరుగు మీద పెట్టింది.

మాట్లాడుకుంటూ ఇద్దరం కలిసి వంట పూర్తిచేసాము. తను నాకన్నా నాలుగేళ్ళు పెద్ద, కానీ చూడ్డానికి కానీ మాటల్లో కానీ అలా అనిపించలేదు. నా వయసు అమ్మాయిలాగానే కలిసిపోయింది.

తినేప్పుడు హనీష 'దిల్ మిల్ గయ్'నే కంటిన్యూ చేసింది. ముగ్గురం కలిసి తింటూ మరో రెండు ఎపిసోడ్లు చూసాము. ఆకలి లేదు అంటూనే హనీష రెండు సార్లు వడ్డించుకుంది. చివరికి రైత్ ఏమీ మిగలకపోవడం నాకు ఆనందాన్ని కలిగించింది. వెన్నెల మర్నాడు ఆఫీసుకి డబ్బా పెట్టుకుంటుండగా నేను, హనీష గిన్నెలు తోమేసాము. ఆ తరవాత వెన్నెల పడుకోవడంకోసం గదిలోకి వెళ్ళింది. నేను, హనీష మరో రెండు ఎపిసోడ్లు చూసాక నిద్రపోయాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story